ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 03.10.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. NALA ఫీజుతో 22-ఏ నిషేధిత నివాస భూముల రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

2. హైదరాబాద్ నగరంలో మౌలిక వసతులు , ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు.

3. ఎల్‌నినో వస్తోందని ఎప్పటి నుంచో నిపుణులు హెచ్చరించినా , కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని బీఆర్‌ఎస్ పార్టీ విమర్శించింది.

4. వికారాబాద్ రోడ్డు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు 5 లక్షలు , తీవ్రంగా గాయపడిన వారికి లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇస్తామని ఐటీ , పరిశ్రమల మంత్రి డి. శ్రీధర్ బాబు ప్రకటించారు.

**22-ఏ**

రాష్ట్రంలో 22-ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నాలా అనుమతి లేకుండా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నిర్ణీత నాలా రుసుము చెల్లించడం ద్వారా అర్హత కలిగిన భూముల రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి మార్గం సుగమమైంది. ఈ మేరకు స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు జారీ చేసింది. ప్రజలకు ఇబ్బంది కలగకుండా దరఖాస్తులను పారదర్శకంగా నిర్ణీత కాలపరిమితిలోగా వేగంగా పరిష్కరించాలని తన ఉత్తర్వుల్లో అధికారులను ఆదేశించింది.

డెస్క్

**కిషన్ రెడ్డి**

నగరంలోని మౌలిక వసతులు , ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. తార్నాకలోని CSIR-IICTలో ఆయన అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా 'దిశా' కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... సనత్‌నగర్ - ఫతేనగర్ రైల్వే వంతెన విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని , ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై భారం తగ్గించేలా నూతన వేస్ట్ ప్లాంట్లు , ముషీరాబాద్‌లోని లెదర్ పరిశ్రమల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు 20 లక్షల రూపాయల వరకు బ్యాంక్ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఆర్.ఎన్.యూ హెడ్

**SIR-CEO**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- సర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంపై ఈరోజు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో లాజికల్ వ్యత్యాసాలు, నో-మ్యాపింగ్ కారణాల వల్ల మొత్తం 92 లక్షల 88 వేల 181 నోటీసులు ఇవ్వాల్సి ఉండగా, 92 లక్షల 88

వేల 180 నోటీసులను సిద్ధం చేసినట్లు తెలిపారు. వీటిలో 90 లక్షల 26 వేల 993 నోటీసులను ఓటర్లకు అందజేయగా, 2 లక్షల 61 వేల 191 నోటీసులు పంపిణీకి పెండింగ్‌లో ఉన్నాయని వివరించింది. పరిశీలనల అనంతరం ఇప్పటివరకు 59 లక్షల 35 వేల 479 మంది ఓటర్లు తుది ఓటర్ల జాబితాకు అర్హులుగా తేలినట్లు ప్రకటించింది.

RNU HEAD

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ , ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రాజెక్టు భూసేకరణ , పునరావాస ప్రక్రియపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూసేకరణ , పునరావాస పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన నిధులు ఇప్పటికే సంబంధిత జిల్లాల కలెక్టర్లకు అందాయని పేర్కొన్నారు. కుడి, ఎడమ కాలువల అంచనాలు సిద్ధం చేయడంతో పాటు , పర్యావరణ అనుమతులు, ఎన్జీటీకి సంబంధించిన అంశాలను వేగంగా పరిష్కరించాలని మంత్రి అధికారులకు సూచించారు.

డెస్క్

**పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

ప్రజా ప్రభుత్వం పేదల ఇంటికే సంక్షేమ పథకాలను చేరవేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా , నేలకొండపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు చేశారు. కట్టుకాచారం గ్రామంలో పాలేరు వాగుపై 6.65 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం

కట్టుకాచారం నుంచి బట్టుకుంటవాగు వరకు రెండున్నర కోట్ల రూపాయలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కట్టుకాచారంలో తమ ప్రభుత్వం ఏర్పడిన 35 నెలల్లో సుమారు 14 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నాయని , దీంతో నీటి లభ్యతపై ప్రభావం పడుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కట్టు కాచారం వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తవడం రైతులకు ప్రయోజనకరమని పేర్కొన్నారు.

పీటీసీ, ఖమ్మం

**జనగాం-ఎమ్మెల్సీ ఓటు నమోదు**

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కోసం అర్హులైన పట్టభద్రులు ఫారం- 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జనగాం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. గతంలో పేరున్నవారు కూడా తిరిగి దరఖాస్తు చేయాలని , ఆన్‌లైన్ లేదా ఏఈఆర్‌ఓల వద్ద పత్రాలు సమర్పించవచ్చని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన సూచించారు.

పీటీసీ, జనగాం

**రామప్ప దేవాలయం**

అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 18 దేశాలకు చెందిన 28 మంది విదేశీ ప్రతినిధులు ములుగు జిల్లాలోని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయాన్ని సందర్శించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ , డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న సామర్థ్య వికాస శిక్షణలో భాగంగా వీరు ఆలయాన్ని సందర్శించి , ఇక్కడి అద్భుత శిల్ప సంపదను కొనియాడారు.

పీటీసీ, ములుగు

**బతుకమ్మ వేడుకలు**

రాష్ట్రంలో ఈనెల 10 నుంచి 18 వరకు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. బతుకమ్మ వేడుకల నిర్వహణపై ఉన్నతాధికారులతో సమీక్ష జరిపిన ఆయన... చివరి రోజైన అక్టోబర్ 18వ తేదిన ట్యాంక్‌బండ్‌పై వేలాది మంది మహిళలతో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. పది రోజుల పాటు రవీంద్రభారతితో పాటు రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయని సీఎస్ పేర్కొన్నారు.

డెస్క్

**హరీశ్ రావు**

ఎల్‌నినో వస్తోందని ఎప్పటి నుంచో హెచ్చరించారని , ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు చేయలేదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. విద్యుత్ సంక్షోభాన్ని ఎల్ నినో , బొగ్గు కొరత సాకులుగా చూపుతూ విఫలమైందన్నారు. సింగరేణిని పరిశీలించేందుకు వెళ్తే సెక్యూరిటీ పేరుతో అడ్డుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం సరైన నిర్వహణ లేక వర్షాకాలంలోనూ కరెంట్ ఇవ్వలేకపోతోందన్నారు.

డెస్క్

**వికారాబాద్-శ్రీధర్ బాబు**

వికారాబాద్ రోడ్డు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు 5 లక్షలు , తీవ్రంగా గాయపడిన వారికి లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి డి. శ్రీధర్ బాబు ప్రకటించారు. క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం మంత్రి

మాట్లాడుతూ... ప్రమాదానికి గురైన ట్రావెల్స్ యాజమాన్యంతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదైనట్లు తెలిపారు. పూర్తి వివరాలు సేకరించి బాధ్యులపై చర్యలకు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా , వికారాబాద్ ఘాట్ రోడ్డులో ప్రయివేట్ బస్సు బోల్తా పడిన ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. మరో 50 మందికి గాయాలయ్యాయి.

బైట్ ... శ్రీధర్ బాబు, మంత్రి

పిటిసి, వికారాబాద్

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలో 'ఇందిరమ్మ మహిళా కుట్టు మిషన్ల ' కోసం 18 నుండి 50 ఏళ్ల మధ్య గల బీసీ మహిళల నుంచి 7,323 దరఖాస్తులు వచ్చినట్లు బీసీ సంక్షేమ అధికారి అబ్దుల్ నదీమ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయాల్లో వీటిని పరిశీలించి తుది జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

పీటీసీ, ఆసిఫాబాద్

**మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా నాకాబందీ నిర్వహించారు. సరిహద్దుల నుండి బియ్యం, ధాన్యం, గంజాయి, మద్యం అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా తనిఖీలు చేసి, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు డీసీపీ భాస్కర్ ఆకాశవాణికి తెలియజేశారు.

బైట్ ... భాస్కర్, డీసీపీ మంచిర్యాల

పీటీసీ, మంచిర్యాల

**మెదక్ పోషణ ఛాంపియన్**

మెదక్ జిల్లా నర్సాపూర్ లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ ఛాంపియన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఆరోగ్యం , పోషణ మెరుగుదలకు కృషి చేస్తున్న సిబ్బంది సేవలను నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్ అభినందించారు.

పీటీసీ, మెదక్

**ఇండియన్ రెడ్ క్రాస్**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 11న జరగనున్నాయి. 15 ఈసీ స్థానాలకు గాను 33 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి మమత తెలిపారు.

పీటీసీ, నల్లగొండ

**సిరిసిల్ల- ఖరీఫ్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగర్వాల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం, 4 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.

పీటీసీ, సిరిసిల్ల